సాగర్ రింగ్‌రోడ్ లెఫ్ట్ లూప్‌ను వెంటనే వాడుకలోకి తీసుకురావాలి : దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి


సాగర్ రింగ్‌రోడ్‌లోని ఫ్లైఓవర్ లెఫ్ట్ లూప్‌ను పరిశీలిస్తున్న కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సాగర్ రింగ్‌రోడ్‌లోని ఫ్లైఓవర్ లెఫ్ట్ లూప్‌ను వెంటనే వాడుకలోకి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం సాగర్ రింగ్‌రోడ్‌లోని ఫ్లైఓవర్ లెఫ్ట్‌లూప్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెఫ్ట్‌లూప్ పనులు పూర్తై చాలా రోజులైందని దాన్ని వాడుకలోకి తీసుకుని రాకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వాహనదారులకు ట్రాఫిక్ ఇక్కట్లు కలుగకుండా ప్రయాణం సులువయ్యేందుకు వెంటనే లెఫ్ట్‌లూప్‌ను వాడుకలోకి తీసుకురావాలని కోరారు. అనంతరం ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసిన ఆయన ఫ్లైఓవర్ లెఫ్ట్‌లూప్‌ను వాడుకలోకి తీసుకొచ్చే విషయంపై చర్చించారు.

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కాలనీలు, బస్తీలలో తాగునీరు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. చంపాపేట డివిజన్ ఓల్డ్ విలేజ్, చంపాపేట చౌరస్తా, హరిజనబస్తీ, మోడల్ మార్కెట్, కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్, శుభోదయకాలనీ, కర్మన్‌ఘాట్ చౌరస్తాలలో జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ శుక్రవారం పర్యటించారు. కాలనీలు, బస్తీల్లో తాగునీరు కలుషితం అవుతుందని కాలనీ ప్రతినిధులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. జలమండలి అధికారులు త్వరితగతిన తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం బలరాంరాజు, డీజీఎం సన్యాసిరావు, మేనేజర్ రమ్యభారతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, నాయకులు పాశం శ్రీశైలం, అంజి, బసంత్, నాగేష్, బస్తీవాసులు, లక్ష్మణ్, జగన్, మైసయ్య పాల్గొన్నారు.

రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసుకోవాలి

వనస్థలిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా వాణిజ్య సముదాయాలు ఏర్పాటు చేసుకోవాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. చింతలకుంట విజయవాడ జాతీయ రహదారిని ఆనుకుని సరస్వతినగర్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఆనుకుని ఉన్న వాణిజ్య సముదాయాలను తొలగింపు చర్యల్లో భాగంగా ఆ వాణిజ్య సముదాయాల నిర్వాహకులు, ముస్లిం మతపెద్దలతో కార్పొరేటర్ శుక్రవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వాణిజ్య సముదాయాలను తక్షణమే తొలగించి, అటుగా వెళ్లే కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా సెట్‌బ్యాక్ జరిగాలన్నారు. రోడ్డుకు ఆనుకుని వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేయడంతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే సెట్‌బ్యాక్ అయ్యి దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, లేనిచో జీహెచ్‌ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ముస్లిం మత పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి డివిజన్‌లోని కమలానగర్‌లోని పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు శుక్రవారం కార్పొరేటర్ కమలానగర్‌లో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో వరదనీటి సమస్యలు తలెత్తకుండా సంబంధిత అధికారులు వరదనీటి పైప్‌లైన్ పనులు వెంటనే చేపట్టాలన్నారు. అనంతరం వరదనీటి కాల్వలో పేరుకపోయిన చెత్త, మట్టి, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించారు. కార్యక్రమంలో డీఈ దామోదర్, ఏఈ చంద్రశేఖర్, సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మౌంట్ ఎల్బ్రస్‌పై ఎగిరిన మువ్వన్నెల జెండా

- యూరప్‌లో అతిపెద్ద పర్వతాన్ని అధిరోహించిన దుండిగల్ యువకుడు


ఎల్బ్రస్ పర్వతంపై జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న తులసిరెడ్డి

దుండిగల్ సిటీ, ఆగస్టు 16ఆంధ్రజ్యోతి): కఠోర సాధనతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించాడు నగర శివారులోని బౌరంపేట్ గ్రామానికి చెందిన తులసిరెడ్డి అనే యువకుడు. 78వ స్వాతంత్ర దినోత్సవం రోజున యూరప్ ఖండంలో అతిపెద్దదైన (5,642 అడుగుల ఎత్తైన) మౌంట్ ఎల్బ్రస్ పర్వతాన్ని తులసిరెడ్డి అధిరోహించి జాతీయ పతాకాన్ని ప్రదర్శించి జై భారత్ అంటూ నినదించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో ఎవరెస్ట్ పర్వతాన్ని తక్కువ సమయంలో అధిరోహించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2019లో సముద్రమట్టానికి 6,153 మీటర్ల ఎత్తులో ఉన్న స్టాక్ ఖంగ్రీ అనే మంచు పర్వతాన్ని మైనస్ 15 డిగ్రీలలో, 2021లో 4190 అడుగుల ఎత్తున ఉన్న కశ్మీరీ గ్రేట్ లెగ్స్ శిఖరాన్ని, 2013లో ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతాన్ని మైనస్ 5 డిగ్రీల ఉష్ణోగ్రతలో అధిరోహించినట్లు తెలిపారు.

ఆకట్టుకున్న భక్త ప్రహ్లాద పద్యనాటకం


భక్త ప్రహ్లాద పద్యనాటక ప్రదర్శనలో కళాకారులు

వనస్థలిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సౌజన్యంతో వనస్థలిపురంలో నిర్వహిస్తున్న నవమి పద్యనాటక పోటీలు 2024 ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ప్రదర్శించిన భక్త ప్రహ్లాద పద్యనాటకం, బ్రహ్మరుషి విశ్వామిత్ర పద్య నాటకాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వీవీ సుబ్బారావు, జడ్జి కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో అంతరించి పోతున్న పద్యనాటకాలను ప్రోత్సహించి కళాకారులను ఆదుకోవాలని కోరారు. మన జీవిత విశేషాలనే నాటక రూపంలో ప్రదర్శించే కళాకారుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీవీవీ సత్యనారాయణ, పంపన వెంకటేశ్వరరావు, సీతారామయ్య, పీ.వీ.కే సోమయాజులు, సీహెచ్ వీఆర్‌కే మూర్తి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపేటలోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


అష్టలక్ష్మీ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు


దిల్‌సుఖ్‌నగర్ భవానీనగర్‌లోని సంతోషిమాత అమ్మవారు


కవాడిపల్లిలోని అష్టలక్ష్మీ అమ్మవారు

వైభవం.. వరలక్ష్మీ వ్రతం

- భక్తులతో ఆలయాలు కిటకిట
- ఇళ్లల్లోనూ ప్రత్యేక పూజలు


సైదాబాద్ మాతామైదాన్‌లో విజయదుర్గామాత ఆలయంలో సామూహిక వరలక్ష్మీ పూజల్లో మహిళలు

ఎల్బీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు ఆలయాలకు భక్తులు బారులుతీరారు. అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున దేవాలయాలకు చేరుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. కొత్తపేటలోని అష్టలక్ష్మీ ఆలయంలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మరుగంటి రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ అగరువత్తిని ఆలయ ప్రతినిధులు వెలిగించారు. ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, ఫౌండర్ చైర్మన్లు చంద్రశేఖర్‌గుప్తా, సుధాకర్‌గుప్తా, కమిటీ సభ్యులు చిలుక ఉపేందర్‌రెడ్డి, మాలే అనిల్, ఉమాపతి పాల్గొన్నారు.

కవాడిపల్లిలోని అష్టలక్ష్మీ ఆలయంలో..


కవాడిపల్లిలోని అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

అబ్దుల్లాపూర్‌మెట్ : వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలోని అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున వరలక్ష్మీ వ్రతం పూజల్లో పాల్గొన్నారు. అభిషేకంతో పాటు కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ అర్చకులు లక్ష్మణాచార్యులు, పవన్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : శ్రావణమాసం శుక్రవారం వేడుకలను మహిళలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గామాత, జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ప్రత్యేక అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలు చేయించారు.

ఎస్ఎన్‌డీపీ పనుల్లో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

- ఎమ్మెల్యే సబితారెడ్డి


విజయపురికాలనీ సమీపంలోని వరదనీటి కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): వరద నీటి వల్ల ప్రజలు ఇబ్బందులు పడకూడదన్న సదుద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో ఎస్ఎన్‌డీపీ ద్వారా చేపట్టిన వరదనీటి కాల్వ పనులు జరుగకుండా అడ్డుకుని ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి విజయపురికాలనీలో రోడ్లు మునిగి ప్రజలు ఇబ్బంది పడ్డ విషయం తెలుసుకుని శుక్రవారం ఆమె ఆ ప్రాంతాన్ని సందర్శించారు. కాలనీవాసులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వరదనీటి కాల్వ పనుల కోసం ఎస్ఎన్‌డీపీ ద్వారా రూ. 6కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ నిధులను అడ్డుకుని కాలయాపన చేస్తున్నదన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణమే నిధులు విడుదల చేసి నాలా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి, నియోజకవర్గం యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బేతి బాపురెడ్డి, విజయపురికాలనీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌డీపీ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి

- జడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్


పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్

చంపాపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లో ఎస్ఎన్‌డీపీ కింద చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయనున్నట్లు జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ సుజాతానాయక్‌తో కలిసి జడ్సీ పర్యటించారు. కాలనీలో ఎస్ఎన్‌డీపీ కింద చేపట్టిన అభివృద్ధి పనులను జడ్సీ పరిశీలించారు. భారీ వర్షాలు కురిస్తే వరద ముంపు సమస్య తలెత్తుతుందని కాలనీవాసులు జడ్సీ దృష్టికి తీసుకెళ్లారు. జడ్సీ మాట్లాడుతూ పనులు పూర్తి చేసేందుకు కొంత ల్యాండ్ సమస్య ఉందని, ఆ సమస్యను త్వరలో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా, ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఇంజనీర్లు కార్తీక్, హేమునాయక్, ఏసీపీ గజానంద్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడుకోవడానికి కృషి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

వనస్థలిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దేశంలో మతోన్మాదం, మనువాదులకు వ్యతిరేఖంగా, ఐక్య పోరాటాలు చేస్తూ, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని గిరి ప్రసాద్ భవనంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సీపీఐ పార్టీ నిర్మాణ మహాసభ నిమ్మల నర్సింహ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టులు, ప్రజా స్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రధాని మోదీ అనుసరిస్తున్న కార్మిక, కర్షక, విద్యార్థి, రైతు యువజన, వ్యతిరేక విధానాలను దేశ పౌరులందరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో సింగరేణిలో కేంద్రం చేపట్టిన బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేసి, సింగరేణిని కార్మికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలమల్లేష్, జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, ఉమామహేష్, యూసఫ్, ఏసురత్నం, కృష్ణమూర్తి, స్వామి, శంకర్, హరినాథరావు, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో రియల్టర్ మృతి

- కుళ్లిన స్థితిలో మృతదేహం లభ్యం

కొత్తపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కుళ్లిన స్థితిలో అతడి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. రియల్టర్ పోతులూరు శ్రీనివాసచారి(40) మన్సూరాబాద్ శైలజాపురికాలనీలో రేణుక అనే మహిళతో 15 సంవత్సరాల నుండి కలిసి ఉంటున్నాడు. అతడు మద్యానికి బానిసయ్యాడు. గొడవల కారణంగా అతడి భార్య రాధిక, వారి కుమారుడు భరత్‌తో కలిసి అతడిని వదిలి తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. అతడు 2018 నుండి గుండె సంబంధ వ్యాధితో సతమతమవుతున్నాడు. తల్లి కళావతి తరచూ ఫోన్లో అతడితో మాట్లాడేది. అతడితో కలిసి ఉంటున్న రేణుక 13వ తేదీన సొంతూరైన సూర్యాపేటకు వెళ్లింది. 13న రాత్రి కూడా అతడు రేణుకతో మాట్లాడాడు. బహుశా ఆ రోజే అతడు మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మూడు రోజుల నుండి అతడి గది నుండి దుర్వాసన వస్తుండడంతో గ్యాస్ వాసన కావచ్చనుకున్నారు. అదే కాలనీలో పక్కింట్లో ఉండే బంధువులు హరిబాబు, మహేందర్‌లు శ్రీనివాసచారి ఇంట్లో నుండి దుర్వాసన వస్తోందని కళావతికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆందోళన చెందిన అతడి తల్లి కళావతి ఆమె పెద్ద కుమారుడు నరేంద్రచారికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. అతడు తన కుమారుడు యశ్వంత్‌తో కలిసి శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకుని గది తలుపులు తెరచి చూస్తే కుళ్లిన స్థితిలో శ్రీనివాసచారి మృతదేహం కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తల్లి కళావతి తన కుమారుడి మృతి పట్ల అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దొంగపోలీస్ అరెస్ట్

- దొంగనోట్ల చెకింగ్ అంటూ బెదిరించి దారిదోపిడీలు
- కటకటాల్లోకి ఇరాన్‌గ్యాంగ్ ముఠా సభ్యుడు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలీస్‌గా చెప్పుకొని బెదిరిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్న ఓ అంతర్రాష్ట్ర దొంగను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇరానీగ్యాంగ్‌కు చెందిన సభ్యుడిగా గుర్తించిన పోలీసులు అతని నుంచి రూ.95వేల నగదు, నకిలీ పోలీస్ ఐడీ కార్డు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. బేగంబజార్, సుల్తాన్ బజార్, అఫ్జల్‌గంజ్, కుల్సుంపురా, లంగర్‌హౌజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధుల్లో ఇటీవల వరుసగా దారిదోపిడీలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘావేశారు. పోలీసు అధికారిగా చెప్పుకుంటూ ఓ వ్యక్తి రోడ్డుమీద వెళ్తున్న వారిని బెదిరిస్తూ మీరు నకిలీ కరెన్సీ (దొంగనోట్లు) తీసుకెళ్తున్నట్లు సమాచారం వచ్చిందని, అందుకే మఫ్టీలో ఉండి చెక్ చేస్తున్నామని నకిలీ ఐడీతో వారిని బురిడీ కొట్టిస్తూ దారిదోపిడీలకు పాల్పడుతున్నాడని గుర్తించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీలు జల్లెడ పట్టి బేగంబజార్ పరిధిలో అతన్ని పట్టుకున్నారు. అతన్ని విచారించగా కర్ణాటక రాష్ట్రం బీదర్ ఇరానీ గల్లీలో ఉండే.. ఇరానీ ముఠాకు చెందిన జాఫర్ అలీ అలియాస్ లంబుగా ఒప్పుకొన్నాడు. ఇతను పలు నగరాల్లో తిరుగుతూ, వ్యాపార ప్రాంతాలు అధికంగా ఉండే ఏరియాల్లో రెక్కీ చేస్తాడు. నగదు రవాణా చేసేవారిని గుర్తించి రహస్యంగా ఫాలో అయి, పోలీస్ అంటూ బెదిరిస్తాడు. మీవద్ద నకిలీ కరెన్సీ ఉందని చెక్ చేయాలని నమ్మిస్తాడు. ఈ క్రమంలో వారి దృష్టి మరల్చి నగదు లేదా బంగారం దోచుకొని ఉడాయిస్తాడు. ఇటీవల వరుసగా ఐదు కేసులు నమోదవడంతో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బృందం రంగంలోకి దిగి, బేగంబజార్ పోలీసులతో కలిసి అతన్ని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టారు.

ఎల్బీనగర్ ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి విఫల యత్నం

కొత్తపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో గుర్తు తెలియని దుండగుడు చోరీకి విఫల యత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున దుండగుడు బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద ఉన్న ఎస్బీఐ ఏటీఎం లాబీలోకి ప్రవేశించాడు. ఏటీఎం మిషన్‌కు ఉండే కనెక్షన్లు తొలగించాడు. వెంటనే అలారం మోగడంతో భయపడి తన బైక్‌పై పరారయ్యాడు. సాంకేతికంగా సమాచారం అందుకున్న సెంట్రల్ సర్వైలెన్స్ మానిటరింగ్ టీం స్టేట్ బ్యాంకు కాలనీలో గల సంబంధిత ఎస్బీఐ శాఖ డిప్యూటీ బ్యాంకు మేనేజర్ బొర్ర సురేష్ కుమార్‌కు సమాచారం ఇచ్చింది. శుక్రవారం ఉదయం వెంటనే ఆయన సదరు ఎస్బీఐ ఏటీఎం లాబీని సందర్శించి, మిషన్‌ను పరిశీలించారు. మిషన్ స్వల్పంగా పాడైనట్టు గుర్తించారు. అనంతరం ఆయన ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీ పరిశీలిస్తూ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా లోకానికి కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- టఫ్ఐడీసీ చైర్మన్ చల్లా, మాజీ ఎమ్మెల్యే తీగల డిమాండ్

సరూర్‌నగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాపాలన సాగిస్తూ మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం పథకం సక్సెస్ కావడంతో కేసీఆర్ కుటుంబానికి మతి భ్రమించినట్టయిందని టఫ్ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి విమర్శించారు. అందుకే ఏంచేయాలో పాలుపోక మహిళలను కించపరిచే విధంగా.. 'బస్సుల్లో రికార్డింగ్ డ్యాన్సులు చేసుకోండి' అంటూ అవమానకరం గా మాట్లాడారని వారు ఆరోపించారు. ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని యావత్ మహిళా లోకానికి కేటీఆర్ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మహిళలను ఉద్దేశించి కేటీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో శుక్రవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మంద మల్లమ్మ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షురాలు పద్మ, పార్టీ నాయకులు సిద్దాల దశరథ, సురేందర్‌రెడ్డి, చల్లా బాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, గంగమ్మ, యాదిరెడ్డి, సుధాకర్, సిద్ధేశ్వర్‌చారి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


దిల్‌సుఖ్‌నగర్‌లో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

మహిళలే తగిన బుద్ధి చెబుతారు

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తుంటే, బీఆర్ఎస్ నాయకులకు మింగుడు పడక అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని తెలంగాణ రహదారుల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ధ్వజమెత్తారు. బస్సుల్లో ప్రయాణించే మహిళల పట్ల కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, శశికళ, శ్రీపాల్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మతిన్ షరీఫ్, సుజాత, వెంకట్‌రాంరెడ్డి, పాషా, మోహన్‌రెడ్డి, మక్సూద్, అరుణ్, విజయ్, భాస్కర్, యుగంధర్, శ్రీనివాస్, రామకృష్ణ, రాము, శ్రీకాంత్ పాల్గొన్నారు.


మంద మల్లమ్మ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న చల్లా, తీగల తదితరులు

వనస్థలిపురం: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ మహిళలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ రాష్ట్ర ఆదివాసి గిరిజన వైస్ చైర్మన్ గాంధీనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎల్బీనగర్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చందునాయక్, శ్రీనివాస్‌నాయక్, శంకర్‌నాయక్, భాస్కర్, సురేష్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న కారును పట్టుకున్న పోలీసులు

- నలుగురు యువకుల అరెస్ట్
- 2 కిలోల గంజాయి స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గంజాయిని కారులో తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో నల్గొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కారును వెంటాడి పట్టుకున్నారు. నలుగురు యువకులతో పాటు కారు, 2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.


గంజాయిని తరలిస్తున్న కారు

వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం, భద్రాచలం నుంచి నలుగురు వ్యక్తులు ఎర్టీగా కారులో గంజాయిని తరలిస్తున్నట్లు నల్గొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు పక్కా సమాచారం అందింది. దీంతో అధికారులు ఖమ్మం నుంచి గంజాయి తరలిస్తున్న కారును వెంబడిస్తున్నారు. అధికారులు వెంటాడుతున్నారని గమనించిన గంజాయి బ్యాచ్ పంతంగి టోల్ గేటు వద్ద ఆపకుండా గేటును గుద్దుకుని నగరం వైపుకు వస్తున్నారు. వెంటనే అధికారులు పలానా కారులో గంజాయి తరలిస్తున్నట్లు హయత్‌నగర్ ఎక్సైజ్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు విజయవాడ జాతీయ రహదారి రామోజీఫిల్మ్‌సిటీ వద్ద చెక్ పాయింట్ ఏర్పాటు చేశారు. చెక్ పాయింట్ వద్ద పోలీసులను గమనించిన గంజాయి బ్యాచ్ తప్పించుకునేందుకు కారును రాంగ్ రూట్‌లో గండి మైసమ్మ ఆలయం వద్ద వరకు వెళ్లారు. అక్కడి నుంచి కారును అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలోకి మళ్లించారు. గంజాయి బ్యాచ్ కారును ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు వెంబడిస్తూనే ఉన్నారు. గంజాయి బ్యాచ్ కారు కాలనీలోకి వెళ్లగానే కాలనీ ప్రధాన రోడ్డును పోలీసులు బ్లాక్ చేశారు. కాలనీ మొత్తం చక్కర్లు కొట్టినా గంజాయి బ్యాచ్‌కు రోడ్డు అవతలివైపుకు వెళ్లేందుకు మరో మార్గం లేకపోవడంతో తిరిగి ప్రధాన రోడ్డు వైపుకు కారును మళ్లించారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో కారును వెనుకకు తీస్తుండగా విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో కారు వెనుక అద్దం పగిలిపోయింది. వెంటనే పోలీసులు కారులో ఉన్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఎన్‌హెచ్ 65 పెట్రోలింగ్ మొబైల్ కానిస్టేబుల్ చేతికి స్వల్ప గాయం అయినట్లు తెలిసింది. కారుతో పాటు 2 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్, ఆర్ఎన్ఎస్ఎనగర్, ఇంద్రానగర్ ప్రాంతానికి చెందిన వారిగా సమాచారం. సులువుగా డబ్బులు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం మొదలు పెట్టినట్లు తెలిసింది. కారును అద్దెకు తీసుకున్నట్లు తెలిసింది. అదుపులోకి తీసుకున్న నలుగురిని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నల్గొండకు తరలించారు.


పోలీసుల అదుపులో గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులు